తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గడ్డం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్
మంగళవారం
20 ఫిబ్రవరి 2024
సంపుటి: 01
సంచిక: 263
పేజీలు: 8
వెల రూ.5.00
Epaper: www.tharangalu.com
Published From:Hyderabad, Circulated to: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,Sangareddy,Warangal,Kurnool,Kadapa, Amaravathi,Krishna



## రాహుల్‌కు కేంద్ర మంత్రి సవాల్

**లక్నో:** కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి పోటీ చేయాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సవాలు చేశారు. అమేథీ ప్రజలు ఎప్పుడో రాహుల్‌ను మరిచిపోయారని చెప్పారు. ప్రస్తుతం అమేథీ పార్లమెంటరీ నియోజకవర్గానికి స్మృతి ఇరానీ ప్రాతినిధ్యం మిగతాది 2లో



## దేశంలోనే మొట్టమొదటి కంటైనర్ ఆసుపత్రి

- ఈ కంటైనర్ హాస్పిటల్ సహాయంతో మొబైల్ ఆసుపత్రి అందుబాటులోకి రానుంది
- మెరుగైన చికిత్స అందించడానికి అందుబాటులో ఆధునిక యంత్రాలు
- ఫిబ్రవరి 25 నుండి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం

**గుజరాత్:** ప్రధాని పర్యటనతో రాజ్‌కోట్ సహా సౌరాష్ట్ర కేంద్రం నుంచి మరో భారీ బహుమతిని అందుకోనుంది. రాజ్‌కోట్ సమీపంలోని పరపిపలియా గ్రామంలో ఎయిమ్స్ ఆసుపత్రిని మిగతాది 2లో

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల విధులు

# సేఫేనా..?!

- కేబినెట్‌లో ఆమోదించినా చట్టబద్ధతకు నోచుకోని సచివాలయశాఖ
- తొమ్మిది నెలల పేస్కేలు కోల్పోయిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు
- సర్వీసు రెగ్యులర్ సమయంలో ఇవ్వాల్సిన 2 ఇంక్రిమెంట్లపై అతీగతీలేదు
- సచివాలయాల్లో అన్నిశాఖల విధులు, అందరూ చేయాల్సిందే.. పేరుకే శాఖలు
- బిఎల్వో విధులకు నేటికీ బిల్లులు పెట్టని జిల్లా కలెక్టర్లు, నాలుగేళ్లుగా ఎదురుచూపు
- నేటికీ కొన్నిశాఖలకు సర్వీసు నిబంధనలు, ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు కాలేదు






**తరంగాలు/ విశాఖపట్నం, అమరావతి:** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సార్వత్రిక ఎన్నికల విధులు అప్పగించాలని కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతులు తెచ్చుకున్నాయి. ఇప్పటి వరకూ బాగానే ఉన్నా.. సీఎం వైఎస్.జగన్మోహనరెడ్డి మానసిక పుత్రికగా ప్రారంభమైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అడుగడుగునా అన్యాయమే జరిగింది. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. దీనితో ఎన్నికల విధులు అప్పగించిన సమయంలో తేడాలు వస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందునే వాదన బలంగా వినిపిస్తున్నాయి. అసలు ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల విషయంలో చేసిన ప్రధాన తప్పిదాలు ఒక్కసారి తెలుసుకుంటే.. 2019లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఈ సచివాలయశాఖను ఏర్పాటు చేసింది. పట్టణాల్లో వార్డు సచివాలయాలు 16 శాఖల సిబ్బందితోనూ, గ్రామాల్లో గ్రామ సచివాలయాల 12 మంది సిబ్బందితోను ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ శాఖలో ప్రభుత్వం ఇతర ప్రభుత్వశాఖలతో సమానంగా సదుపాయాలు, ప్రయోజనాలు ఏర్పాటు చేయాలి. కానీ నాలుగేళ్లు దాటి పోతున్నా.. నేటికీ మిగతాది 2లో



## ఐప్యాక్ ప్రతినిధులతో సీఎం జగన్ భేటీ

- శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు
- మరోసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోన్న వైసీపీ

02లో..

## గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION


**తరంగాలు/హైదరాబాద్:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. గ్రూప్-1 నోటిఫికేషన్‌ను సోమవారం రద్దు చేసింది. ఈ మేరకు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ వెబ్‌నోట్‌ను విడుదల చేసింది. 2022 ఏప్రిల్‌లో 503 పోస్టు లతో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలైన విషయ ం తెలిసిందే. పేపర్ లీకేజీ కారణంగా ఒకసారి ప్రిలిమ్స్‌ను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది. రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహించగా హైకోర్టు రద్దు చేసింది. సరైన నిబంధనలను పాటించకపోవ డంతో రెండోసారి ప్రిలిమ్స్‌ను రద్దయ్యాయి. ఇటీవల మరో 60 గ్రూప్-1 పోస్టులకు ప్రభు త్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. గత నోటిఫికేషన్‌లో ఇచ్చిన 503 పోస్టులతో పాటు కొత్తగా కలిపి 60 పోస్టులు కలిపి మొత్తం 563పోస్టులకు కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చేందుకు కమిషన్ యోచిస్తున్నది.

## మోదీపై తిరుగుబాటు చేద్దాం

- రైతు శత్రువుగా మారిన ప్రధాని మోదీ
- రైతులకు కనీస మద్దతు ధర కల్పించని మోదీ
- రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే..
- ఛత్రపతి శివాజీ చిత్రపటానికి ఘనంగా నివాళులు
- సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ



**తరంగాలు/ హైదరాబాద్:** రైతు నేస్తంగా ఉంటూ ఛత్రపతి శివాజీ మహారాజ్ పాలనా కొనసాగించారని, నేడు ప్రధాని మోదీ రైతు శత్రువుగా మరి దుర్మార్గపు పాలనా కొనసాగిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ ఆరోపించారు. హిమాయత్‌నగర్‌లోని మగ్ధుం భవన్ లో సోమవారం మిగతాది 2లో




## ఢిల్లీకి బయలుదేరిన సీఎం రేవంత్ రెడ్డి

**తరంగాలు/ హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఉన్నారు. ఢిల్లీలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాలతో భేటీ కానున్నారు. వీరితో రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో టికెట్ల కేటాయింపు, చేరికలు, గెలుపు వ్యూహాలపై చర్చించనున్నట్లు సమాచారం. అలాగే అధికారం చేపట్టి రెండు నెలలు పూర్తి కావడంతో కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ గురించి కూడా ఏఐసీసీ పెద్దలతో చర్చించనున్నట్లు సమాచారం.

## యువకుడి ప్రాణం తీసిన మత్తు సూది

- పంటి చికిత్స కోసం వెళితే ప్రాణం పోయింది
- అనస్తీషియా డోస్ ఎక్కువ ఇవ్వటం వల్లేనని బంధువుల ఆరోపణ



**తరంగాలు/ హైదరాబాద్ :** వైద్యో నారాయణ హరి అంటుంటారు పెద్దలు. కనిపించని దేవుళ్లకన్నా ప్రాణం పోసే డాక్టర్లను దేవుళ్లుగా భావించాలనేది దాని సారాంశం. కానీ మారుతున్న కాలంలో వైద్యుల నిర్లక్ష్యం చూస్తుంటే.. వారి చేతిలో రోగుల ప్రాణాలు హరిమంటున్నాయి. వైద్యుల సేవాలోపం రోగులకు ప్రాణసంకటంగా మారుతోంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో మిగతాది 2లో

## ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆధార్ కార్డులు డీయాక్టివేట్ చేస్తున్నారు

- సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు
- ప్రధాని మోదీకి లేఖ రాయనున్నట్లు వెల్లడి



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణ చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన ఆధార్ కార్డులను కేంద్రం డీయాక్టివేట్ చేస్తున్నట్లు మిగతాది 2లో

## కొణతాల రామకృష్ణతో పవన్ కళ్యాణ్ భేటీ!



**తరంగాలు/విశాఖ:** కొంతకాలంగా జనసేన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణతో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. విశాఖ పర్యటనలో భాగంగా కొణతాల ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. దాదాపు 50 నిమిషాల పాటు వీరి భేటీ కొనసాగిం ది. అనకాపల్లి ఎంపీగా నాగబాబు పోటీ చేస్తారని ప్రచారం జరుగుతుండటంతో కొణతాల పార్టీ కార్యకలా పాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో నాగబాబు రెండుసార్లు సమావేశమైనప్పటికీ కొణ తాల దూరంగా ఉన్నారు. ఈ క్రమంలో నే అనకాపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేయా లని కొణతాల రామకృష్ణను నాగబాబు కోరారు. అయినప్పటికీ మిగతాది 2లో

## ఆడబిడ్డలకు తీరని అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

- ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ బిడ్డలకు అన్యాయం
- వికలాంగుల ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయింది
- సోనియా, ఖర్గేలకు కవిత లేఖ

**తరంగాలు/ హైదరాబాద్:** ఇందిరమ్మ రాజ్యం పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇంటి ఆడబిడ్డలకు తీరని అన్యాయం చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఉద్యోగావకాశాల్లో మహిళల హక్కులను హరించేలా రోస్టర్ పాయింట్లు లేని హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని మండిపడ్డారు. తెలంగాణలో ఆడబిడ్డలకే కాకుండా



వికలాంగుల ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నియామకాల్లో ఆడబిడ్డలకు అన్యాయం జరిగే జీవో 3ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో 3ను వెనక్కి తీసుకునేలా సీఎం రేవంత్ రెడ్డిని ఆదేశించాలంటూ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మిగతాది 2లో

## రాహుల్‌కు కేంద్ర మంత్రి సవాల్

– మొదటి పేజీ తరువాయి

వహిస్తున్నారు. తన నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జరిగిన 'జన్ సంవాద్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాహుల్ సైతం 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా అమేథీ చేరుకున్నారు. 2019లో ఆయన (రాహుల్) అమేథీని విడిచిపెట్టారు. ఈరోజు ఆయనను అమేథీ విడిచిపెట్టేసింది. ఆయనకు అంత ధీమా ఉండుంటే అమేథీని విడిచి వయనాడ్ (రాహుల్ నియోజకవర్గం)కు వెళ్లి ఉండేవారు కాదు. అమేథీ నుంచి ఆయనను పోటీ చేయనీయండి చూద్దాం" అని స్మృతి ఇరానీ అన్నారు. రాహుల్ గాంధీ గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో అమేథీలోని ఖాళీ రోడ్లే చెబుతాయంటూ ఛలోక్తి విసిరారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో కాంగ్రెస్‌కుగట్టి పట్టు ఉన్నప్పటికీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. స్మృతి ఇరానీచేతిలో రాహుల్ గాంధీ 55,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. యూపీలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ కేవలం ఒక్క సీటు గెలుచుకుంది. ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఒక్కరే రాయబరేలి నుంచి గెలిచారు.

## దేశంలోనే మొట్టమొదటి కంటైనర్ ఆసుపత్రి

– మొదటి పేజీ తరువాయి

నిర్మించారు. అక్కడ దేశంలోనే తొలి కంటైనర్ హాస్పిటల్ కూడా ఇక్కడే నిర్మిస్తున్నారు.. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న 23 ఎయిమ్స్‌లో రాజ్‌కోట్, భువనేశ్వర్ ఎయిమ్స్ మాత్రమే కంటైనర్ హాస్పిటల్ ప్రయోగానికి ఆమోదం పొందాయి. దీనికి స్థలం కూడా కేటాయించబడింది. ఈ కంటైనర్ హాస్పిటల్ సహాయంతో, మొబైల్ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. వెంటనే ఈ మొబైల్ ఆస్పత్రి సంఘటనా స్థలానికి చేరుకుంటుంది. ఇందులోని వైద్య సిబ్బంది బాధితులకు అక్కడికక్కడే చికిత్స అందజేస్తారు. ఈ కంటైనర్ ఆస్పత్రిలో దాదాపు 15 ప్రత్యేక చికిత్సలు కూడా ఉంటాయని అధికారులు వెల్లడించారు.. దీని తరువాత, మల్టీస్పెషాలిటీ చికిత్సతో సహా మొత్తం 23 చికిత్సలు సమీప భవిష్యత్తులో దశలవారీగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రాజ్‌కోట్‌లోని పారా పిప్లియా గ్రామంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కలల ప్రాజెక్ట్‌లో భాగమైన ఆసుపత్రి పునరుద్ధరణ పని పూర్తైంది. ఫిబ్రవరి 25 నుండి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించబడుతుంది. ఇప్పటికే ఏర్పాట్ల హడావుడి మొదలైంది. రోగులకు మెరుగైన చికిత్స అందించడానికి ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉంచారు. దీంతో రోగులు గుజరాత్ నుంచి ఇతర ప్రాంతాలకు చికిత్స కోసం వెళ్లాల్సిన అవసరం లేదు. ఇక్కడకు వచ్చే రోగులకు అవసరమైన నాణ్యమైన వైద్యం అందించేలా మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారు. సౌరాష్ట్రలోని మారుమూల ప్రాంతాలైన ద్వారక, సోమనాథ్‌ల ప్రజలు చికిత్స కోసం అహ్మదాబాద్‌కు వెళ్లాల్సి వచ్చింది. అయితే తీవ్ర వ్యాధులకు చికిత్స పొందేందుకు ప్రజలు చెన్నై, ముంబై, ఢిల్లీలకు వెళ్లాల్సి వచ్చేది. ఆర్థిక వ్యయం కూడా చాలా ఎక్కువయ్యేది. రాజ్‌కోట్‌లో ఎయిమ్స్ అందుబాటులోకి వస్తుండటంతో సౌరాష్ట్ర ప్రజలు ఆరోగ్య రంగంలో చాలా పెద్ద బహుమతిని పొందుతున్నారని పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 25న రాజ్‌కోట్ ఎయిమ్స్‌ను ప్రధాని ప్రారంభించనున్నారు. ఆ తర్వాత రాజ్‌కోట్ ఎయిమ్స్‌లో చికిత్స కూడా అందుబాటులో ఉంటుంది. 190 మంది వైద్యులు, 318 మంది నర్సింగ్ సిబ్బంది రోగులకు సేవలందించేందుకు, చికిత్స అందించనున్నారు. 250 ఐపీడీ బెడ్లను ప్రారంభించనున్నారు. ఇందులో 25 పడకలను ఐసీయూతో ఉంచుతారు. 250 పడకల ఆపరేషన్ థియేటర్‌తో పాటు 250 ఐపీడీ పడకలను ప్రారంభించనున్నారు. ఐపీడీతో పాటు కొత్తగా 15 సేవలను ప్రారంభించనున్నట్టు రాజ్ కోట్ ఎయిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సీడీఎస్ కటోచ్ తెలిపారు. ఇందులో అత్యవసర చికిత్స, అడ్మిషన్‌కు బెడ్ సౌకర్యం, ఆపరేషన్ థియేటర్, ఫిజియో, ఈఎన్‌టీ, సర్జరీ, డెంటల్, ఫిజికల్ విభాగం, ఎకో వంటి సదుపాయాలు కూడా ఉంటాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఫిబ్రవరి 25న గుజరాత్‌లోని తొలి ఎయిమ్స్ ఆసుపత్రిని సందర్శించనున్నారు.

## మోదీపై తిరుగుబాటు చేద్దాం

– మొదటి పేజీ తరువాయి

ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా సమితి అధ్వర్యంలో చారిత్రక ఛత్రపతి ఛాయాచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ముందుగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నారాయణ, వీఎస్ బోస్, బాల నరసింహ, ఎస్ ఛాయాదేవి, స్టాలిన్, బీ వెంకటేశం, నేదునూరి జ్యోతి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. నాలుగు వందల సంవత్సరాల క్రితం రైతుల సంక్షేమం, వారి ప్రయోజనాల కోసం ఛత్రపతి శివాజీ అనేక సంస్కరణలు తన పరిపాలనలో తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. తన రాజ్యంలోని రైతులను నేరుగా పిలిపించి వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. భూస్వామ్య వ్యవస్థను తొలగించి నూతన రెవెన్యూ వ్యవస్థను నెలకొల్పడం జరిగిందన్నారు. రైతులు పండించిన పంట దిగుబడి ఆధారంగా ఆ పంట యొక్క విస్తీర్ణాన్ని కొలిచి, ఆ తర్వాత మాత్రమే పన్నులు వసూలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. నేడు అధికారంలో కొనసాగుతున్న మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని నారాయణ ధ్వజమెత్తారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తానని పార్లమెంటులో ప్రగల్భాలు పలికిన మోదీ అనంతరం హామీలు నెరవేర్చకుండా రైతులను మోసం చేసాడని మండిపడ్డారు. రైతులు తిరిగి తమ హక్కులను సాధించుకోవడానికి చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కానీ రాజధానికి బయలుదేరిన రైతులను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. పోలీసు సైన్యం పహారాల మధ్య ఢిల్లీ బోర్డర్లను ప్రభుత్వం దిగ్బంధించడం సిగ్గుచేటన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ చర్యలన్నింటినీ ప్రతిఘటిస్తూ ముందుకు వస్తున్న రైతులపై రబ్బర్ బుల్లెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రోన్ల సహాయంలో పిల్లేట్లను వదులుతూ, లాఠీచార్జి చేస్తూ రైతులను గాయపరుస్తున్నాని మండిపడ్డారు. ప్రజలకు అన్నం పెడుతున్న రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైన, ప్రజాస్వామిక వాదులపైన ఉన్నదని నారాయణ తెలిపారు.

# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల విధులు సేఫేనా..?!

– మొదటి పేజీ తరువాయి

నాలుగైదు ప్రభుత్వశాఖల సిబ్బందికి సర్వీసు నిబంధనలు గానీ, ప్రమోషనల్ ఛానల్ గానీ ఏర్పాటు చేయలేదు.

ఈ సిబ్బందిని రెండేళ్ల సర్వీసు తరువాత ఉద్యోగాలను రెగ్యులర్ చేయాల్సి ఉండగా వీరితో 9నెలలు అధనంగా విధులు చేయించుకొని ఆ తరువాత సర్వీసు రెగ్యులర్ చేసింది. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోని 15వేల 5 గ్రామ, వార్డు సచివాలయాల్లోని సుమారు 1.30లక్షల మంది ఉద్యోగులు వారి పేస్కేలు, రెండు డిఏలను కోల్పోవాల్సి వచ్చింది. అంతేకాకుండా సర్వీసు రెగ్యులర్ చేసే సమయంలో వీరికి చెల్లించాల్సిన రెండు ఇంక్రిమెంట్లు కూడా చెల్లించకుండానే వదిలేసింది. పైగా దానిపై నేటి వరకూ ఎలాంటి ప్రకటనా చేయలేదు. అలా చేయడం వలన సచివాలయ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేసే సమయంలో చాలా ప్రయోజనాలు కోల్పోవాల్సి వచ్చింది. తద్వారా ఒక్కో ఉద్యోగి వీరి సర్వీసులో సుమారు రూ.3 లక్షల వరకూ ప్రయోజనాలు కోల్పోవాల్సి వచ్చింది. కరోనా సమయంలో సచివాలయ ఉద్యోగుల సేవలు లేకపోతే అత్యధికంగా ప్రాణ నష్టం జరిగి ఉండేది.. సేవలు చేస్తూ ఉద్యోగులు మృత్యువాత పడి ప్రజలకు సేవలు అందించారు. కానీ వీరిని కనీసం ప్రభుత్వం గుర్తించలేదు. వీరికి అమలు చేయాల్సిన ప్రయోజనాల విషయంలో నేటికీ ఒక్క ప్రకటన కూడా చేయలేదు. బయటకి చెబితే ఎక్కడ వేటు పడుతుందోనని వీరంతా లోలోనే మధన పడుతున్నారు. సమయం వచ్చినపుడు తమ సత్తా చూపించాలని కూడా ఇటీవల రాష్ట్ర రాజధానిలో జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో కూడా నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. నేటి వరకూ ఇతర ప్రభుత్వశాఖల ఉద్యోగుల కంటే తమ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అన్ని ప్రభుత్వశాఖల సేవలు చేస్తున్నా తామ విషయంలో చాలా వివక్షకు గురవుతున్నామని మండి పడుతున్నారు. ఏప్రభుత్వ శాఖలో ఉద్యోగులైనా వారి శాఖ సేవలు మాత్రమే చేస్తారని..కానీ సచివాలయ ఉద్యోగులు మాత్రం అన్ని



ప్రభుత్వశాఖల సేవలు చేయడంతోపాటు, ఖాళీగా ఉన్న ఉద్యోగుల విధులు కూడా చేయాల్సి వస్తోందని కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వశాఖల ఉద్యోగులతో అయితే ప్రభుత్వానికి తీరని నష్టం ఏర్పడుతుందని.. ఈసారి ఎన్నికలకు సచివాలయశాఖ ఉద్యోగులను వినియోగించడం ద్వారా తమ ప్రభుత్వంలోనే వారికి ఉద్యోగాలొచ్చాయి గనుకు మంచి ఉద్దేశ్యంతో పనిచేస్తారని భావిస్తోంది. అయితే ప్రభుత్వం సచివాలయశాఖ ఉద్యోగుల విషయంలో చేసిన తప్పులను, ఎగ్గొట్టిన ప్రయోజనాల విషయాని నిఘా సంస్థలు ఎప్పటి కప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూనే ఉన్నాయి. అయినప్పటికీ తమ ప్రభుత్వమే ఉద్యోగాలిచ్చిందని..పైగా ఉద్యోగులు తోక జాడిస్తే..చట్టబద్ధత కల్పించని ఈశాఖ గాలిలో కలిసిపోతుందనే భయం కూడా వారికి ఉండాలనే ఆలోచనతో ఉన్నట్టు కూడా సంకేతాలు అందుతున్నాయి. ఈ సచివాలయశాఖకు కేబినెట్ లో చట్టబద్ధత ఆమోదం తెలియజేసినా..అసెంబ్లీలో మాత్రం బిల్లు రూపంలోకి తీసుకురాలేదు. అదే సమయంలో ఉద్యోగులను మభ్య పెట్టేందుకు కేవలం కొన్ని శాఖల ఉద్యోగులకే పదోన్నతులు కల్పించి మిగిలిన శాఖలను వదిలేసింది ప్రభుత్వం. దీనితో ఒకేసారి విధుల్లోకి చేరిన అందరు ఉద్యోగులకంటే కొన్ని శాఖల ఉద్యోగులకే పదోన్నతులు రావడం పట్ల కూడా మిగిలిన శాఖల ఉద్యోగులు తీవ్ర కోపంతో రగిలిపోతున్నారు. మరోవైపు మహిళాపోలీసుల ఉద్యోగాల విషయంలో ఇప్పటికే కోర్టులో కేసులు ఉండటం, ఇపుడు ఈ శాఖ ఉద్యోగులు ఏ ప్రభుత్వ శాఖకు చెందకుండా అన్నిశాఖల విధులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం వెల్ఫేర్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితరశాఖల ఉద్యోగులకు ప్రమోషనల్ ఛానల్ ఏర్పాటు చేయకపోవడంతో తమపరిస్థితి ఏంటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వశాఖల ఉద్యోగులు, అందునా సచివాలయశాఖ ఉద్యోగుల సమస్యలు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నింటినీ ఒకేసారి తీరుస్తామని ప్రత్యర్థి రాజకీయపార్టీలు ప్రకటిస్తుండటంతో సచివాలయ ఉద్యోగులు వారి ఆలోచనలు మార్చుకొని, డిమాండ్లు, సమస్యలను ఇతర రాజరీయపార్టీకలు విన్నవిస్తున్నారు. ప్రస్తుత గ్రామస్థాయిలో ప్రజలకి బాగా దగ్గర ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు సచివాలయ ఉద్యోగులే కావడంతో వీరి ద్వారా ఎన్నికల్లో బాగా నెట్వర్క్ చేసుకోవచ్చునని భావిస్తున్నాయి. అన్ని రాజకీయపార్టీలు వీరి సమస్యలు, డిమాండ్ లు తీర్చేందుకు హామీలు కూడా ఇస్తున్నాయి. ఈ తరుణంలో ఏ రాజకీయపార్టీ అయితే వీరికి పక్కాగా హామీలిస్తే వారికి ఉద్యోగులంతా మద్దతు కల్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. ఈ తరుణంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఎన్నికల విధులు కట్టబెట్టినా తేడాలొచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా అధికారపార్టీలోని కొందరు సీనియర్ నేతలు కూడా సచివాలయ ఉద్యోగులను పెద్దగా నమ్మే పరిస్థితి కూడా కనిపించడంలేదు. ఇప్పటికే చాలా ప్రయోజనాలు ప్రభుత్వ ద్వారా కోల్పోయిన ఉద్యోగులు మనస్ఫూర్తిగా ప్రభుత్వానికి ఎన్నికల్లో మద్దతుగా నిలుస్తారా అంటే ప్రశ్నార్థకమే. కానీ ఈ ఎన్నికల్లో ప్రభావం అంటూ చూపిస్తే 74 ప్రభుత్వశాఖల ఉద్యోగులు, సిబ్బంది కంటే సచివాలయశాఖ ఉద్యోగుల వలన మాత్రమే ప్రతీకూలత కనిపించడానికి ప్రభుత్వ తప్పిదాలు కనిపిస్తున్నాయనేది సుస్పష్టంగా తెలుసున్నది. చూడాలి 2024 ఎన్నికల్లో ఏం జరగనుందనేది..?

## ఐప్యాక్ ప్రతినిధులతో సీఎం జగన్ భేటీ

**తరంగాలు/ అమరావతి:** ఏపీలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ఎన్నికల కోసం అధికార వైసీపీ పలు ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. మరోసారి అధికారమే లక్ష్యంగా వైసీపీ పావులు కదుపుతోంది. ప్లాన్‌లో భాగంగా తాడేపల్లి ఆఫీసులో సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ రెడ్డితో ఐ ప్యాక్ బృందం భేటీ అయింది. ఈ బృందానికి జగన్ పలు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రాంతాలు, నియోజకవర్గాలు, పార్లమెంటు స్థానాల వారీగా పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. వైసీపీకు ఏయే జిల్లాల్లో వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ప్రతిపక్షాలకు ఏయే జిల్లాలు అనుకూలంగా ఉన్నాయి. ప్రజలను ఆకట్టుకోడానికి మ్యానిఫెస్టోలో ఏయే కార్యక్రమాలు చేర్చాలనే అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే మ్యానిఫెస్టోపై పార్టీ సీనియర్లతో జగన్ కసరత్తు చేశారు. తాజాగా ఐప్యాక్ బృందం సూచనతో మ్యానిఫెస్టోలోనూ స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఐప్యాక్ బృందంతో సీఎం చర్చిస్తుండడంతో రాబోయే ఎన్నికల్లో టికెట్ వస్తుందో రాదోనని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు పరేషాన్ అవుతున్నారు. ఐప్యాక్ సర్వే పేరు చెప్పి తమ సీటుకు ఎక్కడ ఎసరు పెడతారోననే ఆందోళన నేతల్లో మొదలైంది. వైసీపీలో ఉంటూ విపక్షాలపై నోరు పారేసుకున్న నేతల్లో కూడా గుబులు పుడుతోంది. తాము పోటీ చేసే సీట్లు అటు ఇటు అయితే పరిస్థితి ఏంటనే దానిపై నేతలు టెన్షన్ పడుతున్నారు.

## ఆడబిడ్డలకు తీరని అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

– మొదటి పేజీ తరువాయి

జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సోమవారం నాడు ఎమ్మెల్సీ కవిత లేఖలు రాశారు. ఈ సందర్భంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మహిళలకు రోస్టర్ పాయింట్లతో కూడిన హారిజాంటల్ రిజర్వేషన్లు అమలవుతున్నాయని, మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్ ఇస్తూనే వర్టికల్ రిజర్వేషన్లతో సమానంగా అమలు చేయాలంటే రోస్టర్ పాయింట్లను పెట్టాలనే ప్రతిపాదన 1996లో తెరమీదికి వచ్చిందని పేర్కొన్నారు. దాంతో జవో 41, 56లను ప్రభుత్వం జారీ చేసిందని గుర్తు చేశారు. 100 ఉద్యోగాల ఉంటే 33 ఉద్యోగాలు కచ్చితంగా మహిళలకు వస్తాయని, అదనంగా మరన్ని ఉద్యోగాలు కూడా వచ్చే ఆస్కారం ఉండేదని వివరించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం హారిజాంటర్ రిజర్వేషన్లు అమలు చేస్తూనే రోస్టర్ పాయింట్లు ఎత్తివేయడానికి జీవో 3ని తీసుకొచ్చిందని తెలిపారు. రోస్టర్ పాయింట్లు రద్దు చేయడం వల్ల 100 ఉద్యోగాల్లో మహిళలకు 33 ఉద్యోగాలు ఇవ్వాలన్న నిబంధనకు భంగం కలుగుతుందని, 33 కంటే తక్కువ ఉద్యోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకే తీవ్రంగా నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాలపై పెట్టే దృష్టి రోస్టర్ పాయింట్లపై పెట్టి ఉంటే ఈ రోజు ఆడబిడ్డలకు అన్యాయం జరిగేది కాదని అన్నారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగే జీవో3ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ప్రకటించారు. జీవో 3ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ వైఖరి ఏమిటో సోనియా గాంధీ చెప్పాలన్నారు.



## అంబేద్కర్ విగ్రహం సాక్షిగా సవాల్

**తరంగాలు/ అమరావతి:** ఇటీవల వైసీపీ 'సిద్ధం' సభలో విలేకరి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ శ్రేణులు చేసిన దాడిని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఖండించారు. మీడియాపై దాడి చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఇదే సమయంలో.. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా తనతో చర్చలకు రావాలని టీడీపీ అధినేత చంద్రబాబు, సీఎం జగన్‌కి సవాల్ విసిరారు. విగ్రహాలు చూసి దళితులు మోసపోరని తేల్చి చెప్పారు. టీడీపీ, జనసేన, వైసీపీని వీడి బయటకు రావాలని బడుగు, బలహీన వర్గాల వారికి విజ్ఞప్తి చేశారు. ఆ మూడు పార్టీలు బీజేపీకి తొత్తులని ఆరోపించారు. అంబేద్కర్ రాజ్యాధికారం కావాలని అడిగాడు కానీ, విగ్రహాలు పెట్టమని అడిగాడా? అని కేఏ పాల్ ప్రశ్నించారు. తాను ఏ మతాన్ని, కులాన్ని విమర్శించనని స్పష్టతనిచ్చారు. పవన్ కళ్యాణ్‌కి ఓట్లు లేవు కాబట్టి అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ చొక్కాలు మడత పెట్టాలని అంటున్నాడని, చంద్రబాబు ఏమో కుర్చీలు ఎత్తమని చెప్తున్నారని దుయ్యబట్టారు. తాను వైజాగ్ నుంచి ఎంపీగా పోటీ చేస్తాని.. తనతో కలిసి నడవాలని.. వేలకోట్లు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని కేఏ పాల్ హామీ ఇచ్చారు.

## కొణతాల రామకృష్ణతో పవన్ కళ్యాణ్ భేటీ!

– మొదటి పేజీ తరువాయి

ఆయన నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఇలాంటి సమయంలో పవన్ కళ్యాణ్ నేరుగా కొణతాల ఇంటికి వెళ్లి సమావేశం కావడం ఆసక్తి రేకెత్తించింది. అయితే ఈ భేటీ అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. కొణతాలతో సమావేశం మర్యాదపూర్వకంగానే అని క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ఉత్తరా ంధ్ర అభివృద్ధిపై చర్చించామని వెల్లడించారు. కాగా, తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలో అధిష్ఠానమే నిర్ణయిస్తుందని ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ తెలిపారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులపై మూడు పార్టీలు నిర్ణయం తీసుకుంటాయని అన్నారు.మూడో వంతు సీట్లు జనసేనకు ఇచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు.

## యువకుడి ప్రాణం తీసిన మత్తు సూది

– మొదటి పేజీ తరువాయి

దారుణం చోటు చేసుకుంది. పంటి చికిత్స కోసం వెళ్లిన ఓ యువకుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడి ప్రాణం పోయిందని మృతుడి తండ్రి ఆరోపించారు. ఈ మేరకు జూబ్లీ హిల్స్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు.ఘటన వివరాల్లోకి వెళితే.. వింజం లక్ష్మీ నారాయణ (28) అనే యువకుడు గత కొంతకాలంగా పంటి నొప్పితో బాధపడుతున్నాడు. దీంతో జూబ్లీహిల్స్ రోడ్ నెం.37లోని ఓ ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లాడు. పరీక్షించిన డాక్టర్లు అతడి పంటిని తీసేయాలని డిసైడ్ అయ్యారు. పన్ను పీకేసె క్రమంలో నొప్పి కలగకుండా ఉండేందుకు అనస్తీ షీయా ఇచ్చారు. అయితే చికిత్స తీసుకున్న కొద్ది గంటల్లోనే లక్ష్మీ నారాయణ ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై బాధితుడి తండ్రి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంబంధిత వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వెల్లడిం చారు. ఆ యువకుడు ఎలా చనిపోయాడు? డాక్టర్ల నిర్లక్ష్యమా అసలు ఏం జరిగింది అనే కోణంలో విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. తదుపరి విషయాలు దర్యాప్తు అనంతరం తెలియజేస్తామని తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆధార్ కార్డులు డీయాక్టివేట్ చేస్తున్నారు

– మొదటి పేజీ తరువాయి

ఆమె తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఎన్‌ఆర్సీని తీసుకువచ్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీల కార్డులను డీయాక్టివేట్ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో ఆమె రిపోర్టర్లతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆధార్ కార్డుల డీయాక్టివేషన్ గురించి ప్రధాని మోదీకి లేఖ రాయనున్నట్లు ఆమె తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఎందుకు భారీ సంఖ్యలో ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. మతువా వర్గానికి చెందిన ప్రజల ఆధార్ కార్డులను ఎక్కువగా డీయాక్టివేట్ చేసినట్లు ఆమె ఆరోపించారు.

## వధువు కోసం వినూత్న ప్రకటన



**భోపాల్:** తనకు భార్య కావాలంటూ ఒక వ్యక్తి సొంతంగా ప్రచారం చేసుకుంటున్నాడు. తన వివరాలతో కూడిన హెూర్డింగ్‌ను ఆటోకు ఉంచాడు. వినూత్న ప్రకటన ద్వారా వధువు కోసం అన్వేషిస్తున్నాడు. మధ్యప్రదేశ్‌లోని దామోహ్‌లో ఈ సంఘటన జరిగింది. 29 ఏళ్ల దీపేంద్ర రాథోడ్ కాబోయే భార్య కోసం వినూత్న విధానాన్ని ఎంచుకున్నాడు. 'భార్య కావాలి' అంటూ తన వివరాలతో కూడిన హెూర్డింగ్‌ను సొంత ఎలక్ట్రిక్ ఆటోకు ఏర్పాటు చేశాడు. తన ఎత్తు, పుట్టిన తేదీ, సమయం, బ్లడ్ గ్రూప్, విద్యార్హతలు, గోత్రం వంటి వివరాలు అందులో పేర్కొన్నాడు. కాగా, సమాజంలో మహిళల కొరత వల్ల వధువు లభించడం లేదని దీపేంద్ర వాపోయాడు. తన తల్లిదండ్రులు పూజల్లో బిజీగా ఉండటంతో తనకు భార్యను వెతకలేకపోతున్నట్లు తెలిపాడు. మ్యారేజ్ గ్రూప్‌లో చేరినప్పటికీ నగరానికి చెందిన వధువు దొరకలేదని చెప్పాడు. దీంతో భార్య కావాలంటూ హెూర్డింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపాడు. తనకు కుల, మత భేదాలు లేవని చెప్పాడు. ఏ మహిళ అయినా పెళ్లి ప్రతిపాదనతో తనను సంప్రదించవచ్చని తెలిపాడు.

## ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**తరంగాలు /మిర్యాలగూడ ప్రతినిధి:**ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత రక్త దాన శిబిరం ప్రారంభించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## సామాజిక కార్యక్రమాలు చేస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ఎర్రమళ్ళ దినేష్



**తరంగాలు /మిర్యాలగూడ ప్రతినిధి :** పట్టణంలోని 19వ వార్డులో ఒక కుటుంబ పెద్దలకు జీవన ఆధారం కొరకు అన్నా నా పరిస్థితి కొంచెం బాగోలేదు నాకు కుటుంబ అవసరాల కోసం ఒక గ్రైండర్ కావాలి అన్నా టిఫిన్ సెంటర్ పెట్టుకుని జీవనాధారం కొనసాగిస్తాను అని చెప్పగానే పెద్ద మనసుతో ముందుకు వచ్చి ఆమె అడిగినటువంటి గ్రైండర్ను తన సొంత డబ్బులతో మిర్యాలగూడ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ఎర్రమళ్ళ దినేష్ అందించడం జరిగింది ఇలాగే ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తూ ఆపదలో ఉన్న వాళ్ళని ఆదుకుంటూ ముందు భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని కోరుకుంటున్నారు.

## వైరా నూతన ఎంవీఐగా బాధ్యతలు చేపట్టిన వరప్రసాద్



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం జిల్లా:** వైరా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా ఏ. వరప్రసాద్ సోమవారం వైరా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన శంకర్ నాయక్ బదిలీపై ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లిన విషయం విధితమే. ఖమ్మంలో విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. వాహనాలకు అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తనను నేరుగా సంప్రదించాలని కోరారు.

# ప్రజా సంక్షేమమే శివాజీ మంత్రం

- **మోటె చిరంజీవి.. సామాజికవేత్త, విశ్లేషకులు**

**డెస్క్:** శివాజీ, భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేరు. ఈ పేరు వింటే హిందూ మతం పులకించిపోతుంది. మొఘలుల దాడుల నుంచి హిందూమతాన్ని రక్షించిన ఘనత ఆ మరాఠా యోధుడికే దక్కుతుంది. విదేశీ సుల్తానులను, మొగలాయి పాలకులను తరిమికొట్టడానికి ఉద్భవించిన చారిత్రక పురుషుడు శివాజీ మహారాజ్ 1630 ఫిబ్రవరి 19న జన్మించాడు. దాదాజీ కొండదేవ్ శిక్షణ కారణంగా 17 సంవత్సరాల వయసులోనే ప్రత్యేక్ష యుద్ధాలు చేశాడు. ఆయన యుద్ధంలో మొదటగా తోరణ దుర్గాన్ని వశం చేసుకున్నాడు. తల్లి సంరక్షణలో బైరంఖాన్ శిక్షణలో రాటుదేలిన శివాజీ తన యుద్ధ తంత్రాలతో బీజపుర, గోల్కొండ సుల్తానులు, మొఘలులకు ముచ్చెమటలు పట్టించాడు. భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేరు. ఈ పేరు వింటే హిందూ మతం పులకించిపోతుంది. మెఘలుల దాడుల నుంచి హిందూమతాన్ని రక్షించిన ఘనత ఆ మరాఠా యోధుడికే దక్కుతుంది. తన గురువు సమర్థ రామదాసు, తల్లి జిజియాబాయి బోధనలతో హిందూ మత సంరక్షణకు కంకణం కట్టుకున్నాడు. స్వశక్తితో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన శివాజీ గురించి చరిత్రకు తెలియని నమ్మశక్యం గాని నిజాలు ఎన్నో ఉన్నాయి. శివాజీ పేరు శివుడు నుంచి వచ్చింది కాదని చాలా మంది అనుకుంటారు. కానీ అది నిజం కాదు, ఓ ప్రాంతంలోని భక్తులు శివుడుని శివాయ్ అని పిలుస్తారు కూడా. ముస్లిం దురాక్రమణదారులను శివాజీ వ్యతిరేకించినా తన రాజ్యంలో మాత్రం లౌకికవాదాన్ని పాటించారు. అన్ని మతాల వారినీ సమానంగా ఆదరించారు. ఇతర మతాలను నుంచి హిందువులుగా మారిన వారిని గౌరవించేవాడు. అంతే కాదు హిందువుగా మారిన ఓ వ్యక్తికి తన కుమార్తెను ఇచ్చి వివాహం జరిపించాడు. హిందూ మతాన్ని కాపాడటం కోసమే ముస్లిం దురాక్రమణదారులతో యుద్ధం చేశాడు తప్ప ఎప్పుడూ వారి మతాన్ని వ్యతిరేకించలేదు. అతని స్నేహితుల్లో చాలా మంది మహ్మదీయులు ఉన్నారు. అంతే కాదు సైనిక వ్యవస్థలో ఎంతో మంది ముస్లింలకు సుముచిత స్థానం కల్పించారు. బిజపుర సుల్తాలను ఓడించడానికి మెఘల్ పాలకుడు ఔరంగజేబుకు సహాయపడ్డాడు. అహ్మద్‌నగర్ ముట్టడిలో కీలక పాత్ర పోషించాడు. యుద్ధ తంత్రాల్లోనూ శివాజీ అనుసరించే విధానం శత్రువులకు అంతుబట్టని



విధంగా సాగేది. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన 2,000 మంది సైనికులను 10,000 మంది స్థాయికి పెంచుకోగలిగాడు. సైనిక సంపత్తి ప్రాముఖ్యతను, తిరుగులేని యుద్ధ వ్యూహాలను అనుసరించడమే శివాజీ అసమాన ప్రతిభకు నిదర్శనం. పటిష్ఠమైన సైన్యంతోపాటు నిఘా వ్యవస్థను కూడా కలిగి ఉండటమే కాకుండా, అధునిక యుద్ధ తంత్రాలను ఉపయోగించాడు. వీటిలో ముఖ్యమైంది గొరిల్లా దాడి. శివాజీ తన సైన్యం పట్ల అత్యంత శ్రద్ధ తీసుకునేవారు. వారి ప్రాణాలను ఫణంగా పెట్టి యుద్ధం చేయడానికి విముఖత చూపేవారు. సైనికులు ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే సందర్భంలో అనూహ్యంగా అక్కడ నుంచి వారిని నిష్క్రమింపజేసేవారు. పటిష్ఠమైన నావికా దళం మరాఠాలకు మరింత బలాన్ని చేకూర్చింది. దీనికి శివాజీ వేసిన బలమైన పునాదులే కారణం. విదేశీ దండయాత్రల నుంచి కాపాడటానికి ఇది ఎంతగానో ఉపయోగపడింది. ఆ కాలంలో ఇలాంటి ఆలోచనలు ఏ రాజులకు రాకపోవడం గమనార్హం. తనకంటే బలవంతుడైన, ధీశాలి అయిన అఫ్జల్ ఖాన్‌ను చాకచక్యంగా అంతం చేశాడు. అఫ్జల్ పథకాన్ని ముందుగానే పసిగట్టిన



శివాజీ తన చేతులకు పులిగోళ్లను తొడుక్కుని అతడిని హతమార్చాడు. పరిపాలనా విధానంలో కూడా అనేక మార్పులు తీసుకువచ్చి భారతదేశ రాజులలో చత్రపతి శివాజీ మహారాజ్ అగ్రగణ్యుడయ్యాడు. తాను మాత్రమే నిర్ణయాలు తీసుకోవడం కాకుండా 8 మంది ప్రధానులతో కూడిన మంత్రి మండలి ఏర్పాటు చేశాడు. విదేశాంగ విధానం, పటిష్ఠమయిన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేసాడు. ప్రజల కోసమే ప్రభుత్వం మరియు ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు ఎటువంటి ఖర్చు చేయకుండా ప్రజల సంక్షేమం కోసమే పాటుపడ్డాడు. రాజ్యమంతా కొలతలు వేసి భూమిని లెక్కించి స్థానిక ప్రజల మధ్య సమస్యలు తలెత్తకుండా చేశాడు. నీటిపారుదల కోసం తగిన వ్యవస్థ చేసాడు, బంజరు భూములను పంట పొలాలుగా మార్చడం కోసం విశేషమైన కృషి చేశారు. 1680లో శివాజీ మరణానంతరం వారి వారసులు ఛత్రపతులుగా, పీష్వాలుగా పాలన కొనసాగించారు, ప్రజల్ని కాపాడుకున్నారు. శివాజీ సామ్రాజ్యం నేటి భారతదేశ నైరుతి దిక్కున ఒకప్పుడు చిన్న రాజ్యంగా ప్రారంభమై అనంతరం ఒక మహా సామ్రాజ్యంగా విరసిల్లి 1674 హైందవ స్వరాజ్యంగా ఉనికిలోకి వచ్చి, 1818 వరకు కొనసాగింది. దక్షిణాసియాలో ఎక్కువ భూభాగాన్ని కలిగి ఉన్న సామ్రాజ్యంగా వర్థిల్లింది. ఇలా భారతీయ ప్రజల జీవన విధానాన్ని రక్షించడం కోసం, ప్రాచీన హిందూ సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడడం కోసం చత్రపతి శివాజీ మహారాజ్ చేసిన ప్రయత్నాలు, యుద్ధాలు, అజరామమైనవి అనుసరించదగినవి. జాజ్వల్యమానమైన వారి దేశభక్తికి స్వధర్మ నిష్ఠ, అవధులు లేని ధైర్య సాహసాలకు నామకరణం చేస్తే అతడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అవుతాడు. అతని నియమాలు పాటించినటువంటి వారు గొప్ప శక్తివంతులుగా తయారవుతారు.

# ఎస్‌బీఐ కష్టమర్లకు శుభవార్త

**న్యూఢిల్లీ:**కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇది వరకు ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే బ్యాంకుకు వెళ్లి చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. కానీ దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారులు ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాల కోసం నమోదు చేసుకోవడానికి బ్యాంకు రావాల్సిన అవసరం లేదని, ఎవరికి వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ రెండు పథకాలను నమోదులో సౌలభ్యాన్ని పెంపొందించడానికి తన కస్టమర్ల కోసం మరొక ఎనేబుల్‌ను తీసుకువచ్చిందని ఎస్‌బీఐ తెలిపింది. బీమా చేయబడిన వ్యక్తి ఆకస్మికంగా మరణించిన సందర్భంలో పాలసీ లబ్ధిదారునికి ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకం కింద రూ. 2,00,000 మరణ కవరేజీని అందిస్తుంది. ఇది ప్యూర్-టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ కాబట్టి ఎలాంటి మెచ్యూరిటీ లేదా సరెండర్ ప్రయోజనాన్ని అందించదు. ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన అనేది ప్రమాద బీమా పథకం. ఇది ప్రమాదవశాత్తు మరణం సంభవించిన సందర్భంలో లేదా వైకల్యానికి రక్షణ కల్పిస్తుంది. అయితే ఒక సంవత్సరానికి ఉంటుంది. ఆ తర్వాత ప్రతి సంవత్సరం పునరుద్దరించుకునే అవకాశం



ఉంటుంది. ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన 18-50 సంవత్సరాల మధ్య వయస్సు గల సేవింగ్స్ బ్యాంక్ ఖాతాదారులందరికీ రూ. 2 లక్షల పునరుత్పాదక ఒక సంవత్సరం జీవిత బీమాను అందిస్తుంది. ఏదైనా కారణం వల్ల మరణాన్ని కవర్ చేస్తుంది.

**ఏటా రూ.436 ప్రీమియంతో పీఎం జీవన్ జ్యోతి**

2015 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనని ప్రారంభించింది. ఈ పథకం కింద ఏటా రూ.436 ప్రీమియం చెల్లించాలి. అంటే నెలవారీగా చూస్తే.. 436/12=36.3 అంటే ఒక వ్యక్తి ప్రతి నెలా దాదాపు రూ.36 ఆదా చేస్తే సరిపోతుంది. దీంతో మీరు రూ.2 లక్షల ప్రమాద బీమా పొందుతారు. ఇందుకోసం జీవిత బీమా కార్పొరేషన్‌తో కేంద్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ బీమా పథకం ప్రతి సంవత్సరం పునరుద్ధరించబడుతూనే ఉంటుంది. ఈ పథకం వ్యవధి మే 1 నుండి జూన్ 31 వరకు ఉంటుంది. ప్రమాదం కారణంగా ఆకస్మికంగా మరణిస్తే నామినీకి రూ.2లక్షలు అందజేస్తారు.

**సురక్ష బీమా యోజన..**

ఈ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కూడా ప్రమాద బీమా పథకమే. ప్రమాదవశాత్తు మరణం, వైకల్యానికి సంబంధించిన సందర్భంలో బీమా అందుతుంది. ఇతర సహజ మరణాలకు ఈ బీమా వర్తించదని గుర్తించుకోండి.. మరణం, పూర్తి వైకల్యానికి రూ. 2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ. లక్ష వస్తుంది. ప్రతి సంవత్సరం ఈ స్కీమ్‌లో రూ. 12 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ పథకంలో చేరేటప్పుడే ఆటో డెబిట్ పెట్టేందుకు సమ్మతి ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో మీ అకౌంట్ నుంచి ఏటా డబ్బులు కట్ అవుతుంటాయి. ప్రతి ఏటా జూన్ 1- మే 31 వరకు బీమా కవరేజీ ఉంటుంది. కొనసాగించాలనుకుంటే మే నెలలో రెనివల్ చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాంక్ అకౌంట్ ఉన్న 18-70 సంవత్సరాల వరకు ఎవరైనా ఈ పథకంలో చేరవచ్చు. ఈ పథకాల ప్రయోజనాల కోసం బ్యాంకులు, పోస్టాఫీసులో అందుబాటులో ఉంటుంది. ప్రతి వ్యక్తికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ డిజిటల్ ఎన్‌రోల్‌మెంట్ ఉంటుందని ఎస్‌బీఐ బ్యాంక్ పేర్కొంది. వినియోగదారులు ఎస్‌బీఐ బ్రాంచ్‌ను సందర్శించకుండా వారి సౌలభ్యం మేరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే విధంగా ఈ సదుపాయాన్ని తీసుకువచ్చినట్లు ఎస్‌బీఐ తెలిపింది. అయితే వినియోగదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేటప్పుడు తమ ఖాతా నంబర్, పుట్టిన తేదీని జన్ సురక్ష పోర్టల్‌లో ఎంటర్ చేయాలి.

## అంగన్‌వాడీల వేతనాలు ఒకటో తారీఖున చెల్లించండి



**తరంగాలు/హైదరాబాద్:**సకాలలంలో వేతనాలు పడక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, అంగన్‌వాడీలకు సకాలంలో జీతాలు చెల్లించాలని (మినీ) అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కాంతి వెస్లీని కలిసి వినతి పత్రం అందజేశారు. గత రెండు నెలలుగా గౌరవ వేతనాలు పడక అంగన్‌వాడీ టీచర్లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి నెల ఒకటో తేదీనే గౌరవ వేతనం, ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్లుగా అదే రోజు చెల్లించాలని వారు కమిషనర్‌ను కోరారు. కాగా, బడ్జెట్ కారణంగా వేతనాలు ఆలస్యం అయిందని ఈ వారం రోజుల్లో వేతనాలు అందరికి వేస్తామని కమిషనర్ తెలిపారు.

## సుప్రీం కోర్టు ఆదేశాలు ఇస్తే.. దేశ వ్యాప్తంగా అమలు కావలసిందే

**- సుప్రీం కోర్టు తీర్పు మీకు వర్తించదా**

**- ఏపీ సర్కార్‌కు హైకోర్టు ప్రశ్న**

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ సుమతి ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఎస్‌జీటీ టీచర్ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను కూడా అనుమతించడం సుప్రీంకోర్టు నిబంధనలకు వ్యతిరేకమని పిటిషనర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదించారు. బీఈడీ అభ్యర్థులను అనుమతించడం వలన పది లక్షల మంది డీఎడ్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం, ఎన్సీటీఈ నిబంధనలకు పూర్తిగా వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఖాళీల ప్రక్రియ చేపట్టిందని పిటిషనర్ వాదనలు




వినిపించారు. తప్పులతడకగా నోటిఫికేషన్ విడుదల చేసి లక్షలాదిమంది జీవితాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటుందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సుప్రీం కోర్టు తీర్పు స్పష్టంగా ఉన్నా బీఎడ్ అభ్యర్థులను ఎలా అనుమతించారని ధర్మాసనం ప్రశ్నించింది. సుప్రీం కోర్టు తీర్పు మీకు వర్తించదా అని వ్యాఖ్యానించింది. ఒక్కసారి సుప్రీం కోర్టు ఆదేశాలు ఇస్తే అవి దేశ వ్యాప్తంగా అమలు కావలసిందే కదా అని ప్రభుత్వ న్యాయవాదిని న్యాయస్థానం ప్రశ్నించింది.

## నూతనంగా విచ్చేసిన డిఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన హెూమ్ గార్డ్స్



**తరంగాలు /మిర్యాలగూడ ప్రతినిధి:** సబ్ డివిజన్ కు నూతనముగా విచ్చేసిన డి.ఎస్.పి. మిర్యాలగూడ సబ్ డివిజన్ తరుపున మిర్యాలగూడ హెూమ్ గార్డ్స్ కలిసి అభినందనలు తెల్పటం జరిగినది. ఈ సందర్భంగా శ్రీ డి.ఎస్.పి. హెూమ్ గార్డ్స్ తో విధి నిర్వహణలో హెూమ్ గార్డ్స్ పాత్ర చాల కీలకమైనది అని హెూమ్ గార్డ్స్ పోలీస్ వ్యవస్థకు మంచి పేరు తీసుకొని రావాలని విధినిర్వహణలో అలసత్వం వహించవద్దని.. ఏలాంటి సమస్య వచ్చినా నేరుగా కలవ వచ్చని ఈ సందర్భంగా మాట్లాడినారు. ఈ కార్యక్రమములో కోడిరెక్క కిరణ్. యాదగిరి, నాగేందర్, రమణ, అనిల్, సర్దార్, హజిబాబులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు జాతీయ హెూదా కల్పించాలి

**-జాతీయ బీసీ సంక్షేమ సంఘం.జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం,ములుగు జిల్లా అధ్యక్షులు బట్ట మురళీకృష్ణ...**



**తరంగాలు ప్రతినిధి /ములుగు:** మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హెూదా కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం,ములుగు జిల్లా అధ్యక్షులు బట్ట మురళీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు,జిల్లా అధ్యక్షులు బట్ట మురళీకృష్ణ శ్రీ మేడారం సమ్మక్క సారక్క జాతరకు హాజరై వానదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ములుగు జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత పొందిన ఆసియా ఖండంలోని అతిపెద్ద జాతరగా మరియు కుంభమేళాగా పిలవబడుతున్న మేడారం మహా జాతరకు తెలంగాణ రాష్ట్ర నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి గిరిజనులు,గిరిజనేతరు లే కాకుండా అన్ని కులాల సంబంధించిన కోటి మందికి పైగా భక్తులు మేడారం జాతరకు వచ్చి వనదేవతలను దర్శించుకుని, సమ్మక్క సారక్కకు కుంకుమ , పసుపు చీర సారాలతో నిలువెత్తు బంగారం బెల్లం సమర్పించుకుంటారని తెలియజేశారు. అలాంటి జాతరకు జాతీయ హెూదా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు బట్ట మురళీకృష్ణ ,ఉపాధ్యక్షులు మాంచర్ల నాగేశ్వరరావు,జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు గోపి, జిల్లా యూత్ అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ ,మల్లంపల్లి మండల యువత అధ్యక్షులు జింక వేణు,బీసీ నాయకులు ఎర్రల్ల నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి సిపిఎం మండల నాయకుల పరామర్శ



**తరంగాలు /తొర్రూర్:** అంగన్వాడి వర్కర్స్ యూనియన్ మండల నాయకురాలు మంగళపల్లి లలిత భర్త మంగళపల్లి యాకయ్య (గ్రామీణ వైద్యుడు) కు హార్ట్ స్ట్రోక్ రావడంతో ఓపెన్ సర్జరీ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సోమవారం సిపిఎం తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళపల్లి యాకయ్య ను పరామర్శించి, ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు.

## డిఎస్పీ ని కలిసిన వర్కింగ్ జర్నలిస్టులు





**తరంగాలు /తొర్రూరు:** తొర్రూరు సబ్ డివిజన్ కు నూతనంగా విచ్చేసిన డి.ఎస్.పి. ని తొర్రూరు సబ్ డివిజన్ తరుపున వర్కింగ్ జర్నలిస్టులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా.డి.ఎస్.పి. పోలీస్ వ్యవస్థకు మంచి పేరు తీసుకొని రావాలని విధినిర్వహణలో అలసత్వం వహించవద్దని.. ఏలాంటి సమస్య వచ్చినా నేరుగా కలవ వచ్చని ఈ సందర్భంగా మాట్లాడినారు. ఈ కార్యక్రమములో వేర్పుల మహేష్, వీరాంజనేయులు, సారయ్య, మహేందర్, శేఖర్, యాక స్వామి, దేవేందర్, మురళి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# సొమ్ము కేంద్రానిది... సోకు రాష్ట్రానిది

- **ఆర్భాటాలకు మాత్రమే పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వం...**
- **ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా పనులు చేయాలి...**
- **బిజెపి జిల్లా నాయకులు కుందూరు మహేందర్ రెడ్డి...**






**తరంగాలు/వర్ధన్నపేట:** సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిది అనే విధంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పనితీరు ఉందని,ప్రజా పాలన పేరుతో ఆర్భాటాలకు గత ప్రభుత్వాల మీద నిందలు వేయడానికి మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం పరిమితమైందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా పనులు చేయాలని బిజెపి జిల్లా నాయకులు కుందూరు మహేందర్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన పేరుతో పరిపాలన కొనసాగిస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తన కోట కింద అందించాల్సిన నిత్యవసర సరుకులను పంపిణీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం మాత్రమే ఇస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని దాదాపు రెండు సంవత్సరాలు రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందిస్తున్నారు తప్ప రాష్ట్ర ప్రభుత్వ కోటా కింద ఇవ్వాల్సిన ఒక గింజ బియ్యం గాని ఇతర సరుకులు గాని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదు అని అన్నారు.కానీ రేషన్ షాపుల ముందు ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దురదృష్టకరమని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఒక గింజ కూడా ప్రజలకు ఉచితంగా ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ముందు ఆర్భాటంగా ఫ్లెక్సీల ను ఎలా ఏర్పాటు చేస్తుందని మండిపడ్డారు.రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిత్వ శాఖ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమని విమర్శలు గుప్పించాడు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం న్యాయంగా పేద ప్రజలకు నెలనెలా ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వ ఉచిత బియ్యాన్ని లేదా ఒక రూపాయికి కిలో బియ్యాన్ని అమలు చేసి పేద ప్రజల కడుపు నిండే విధంగా పనిచేయాలని లేదంటే చేయని పనులకు ప్రచారాలు చేసుకోవడం మానుకోవాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యాన్ని తమ ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుండాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటి తప్ప ప్రజలకు ఇప్పటివరకు ఒరిగిందేమీ లేదని హనీమూన్ పీరియడ్ ముగించుకొని నేతలు నియోజకవర్గాల్లో దృష్టి సారించి ప్రజల కష్టసుఖాలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

# సమ్మక్క సారలమ్మ గుడి అభివృద్ధి కృషి చేస్తా

- **ఎమ్మెల్యే కడియం శ్రీహరి...**





**తరంగాలు ప్రతినిధి: ఘన్పూర్:** ఈ నెల ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పర్యవేక్షించారు.అనంతరం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.జాతరకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆయా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే రెండేళ్లలో ఊరినుండి గుడి వరకు, సీసీ రోడ్డు,లైటింగ్ ను,అమ్మవారి గద్దెల దగ్గర గచ్చు,టాయిలెట్స్ ,నీటి వసతుల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా జాతర ఏర్పాట్ల కోసం కృషి చేసిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్వో,ఎంపిడిఓ, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అదికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

- **వరంగల్ ఎంపీ ఆస్పరెంట్ పంజా కల్పన అనాధ బాలలకు ఆసరాగా నిలిచి మానవత్వాన్ని చాటాలి**
- **-మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి**




**తరంగాలు/వర్ధన్నపేట:**అనాధ బాలలకు చేయూతనందిస్తున్న బాల వికాస సేవలు అభినందనీయమని, ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని వరంగల్ ఎంపీ ఆస్పరెంట్ పంజా కల్పన అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాల వికాస సాంఘిక స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన వికాస పిల్లల జన్మదిన వేడుకల కార్యక్రమానికి వరంగల్ ఎంపీ ఆస్పరెంట్ పంజా కల్పన,మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వికాస పిల్లలతో కలిసి అతిధులు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పంజా కల్పన మాట్లాడుతూ బాల వికాస సేవలు అమోఘమని,ఎన్నో ఏళ్ళుగా అనాధ పిల్లలను చేరదీసి వారికి అండగా ఉంటూ వారికి విద్యా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సంస్థ వ్యవస్థపాకురాలు బాల థెరిసా జింగ్రాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.అదేవిదంగా ప్రతి ఒక్కరు ఇతరులకు ఎంతోకొంత సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. బాల వికాస సంస్థకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వికాస బాలల కోసం కల్పన ఐదు వేల రూపాయలు విరాళం అందజేశారు. తాను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా పాలనను అందించాలనే దృఢ సంకల్పంతో ఎంపీ గా పోటీ చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు.అందరు తనకు అండగా ఉండి సహకారం అందించాలని కోరారు.

**అనాధ బాలలకు ఆసరాగా నిలిచి మానవత్వాన్ని చాటాలి**

అనాధ బాలలకు అండగా నిలిచి మానవత్వం చాటాలని మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి అన్నారు.ఇతరులకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఎందులో దొరకదని ముఖ్యంగా అనాధ బాలలకు,అనాధ వృద్దులకు సేవ చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు.ఈ సందర్భంగా ఐదు వేల రూపాయలు విరాళం అందజేశారు.అనంతరం వికాస పిల్లలు, బాల వికాస ప్రతినిధులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తోటకూరి రాజమణి,మాజీ ఎంపీపీ కన్నం స్వరూప, బాలవికాస ప్రోగ్రామ్ మేనేజర్ లత,బాల వికాస ప్రతినిధులు రాణి,ఫాతిమా,సుకన్య,రమ,ఉపేంద్ర, శోభ,అనురాధ,స్వాతి,తదితరులు పాల్గొన్నారు.



# రంగల్ ఎంపీ టికెట్ మాదిగలకు కేటాయించాలి

- వరంగల్,హన్మకొండ జిల్లాల పార్టీ అధ్యక్షులకు వినతి పత్రం అందజేసిన...
- మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్



**తరంగాలు/హన్మకొండ జిల్లా ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ నుండి వరంగల్ ఎంపి టికెట్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికే ఇవ్వాలని కోరుతూ మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) ఆధ్వర్యంలో వరంగల్, హన్మకొండ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావు , హన్మకొండ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దెపాక రవీందర్ మాట్లాడుతూ దళితుల్లో 70శాతం ఉన్న మాదిగ సామాజిక వర్గం నుండి ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి చట్టసభల్లో ప్రాతినిథ్యం లేకుండా పోయిందన్నారు .రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా మాదిగ సామాజిక వర్గం వారికి టికెట్ వచ్చేలా అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారు సీనపెల్లి కొమురయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంఛార్జి సూరారపు నిరంజన్ , రాష్ట్ర నాయకులు పసునూరి మనోహర్ , కంజర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలి

- వరంగల్ పార్లమెంట్ అస్పిరెంట్ డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణ




**తరంగాలు/హన్మకొండ జిల్లా ప్రతినిధి:** ప్లాస్టిక్ ని నిషేదించాలని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడారం కు కాలినడకన ర్యాలీలో వరంగల్ పార్లమెంట్ అస్పిరెంట్ డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ ను నిషేధించాలని ప్రతి సంవత్సరం ఆనవాయితీగా ఈ ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది అన్నారు.ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను, పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మన అందరిదీ అని, మన భవిష్యత్తు ప్రకృతి మీద ఆధార పడి ఉందని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించే విధంగా ముఖ్యమంత్రి, మంత్రులు కొండా సురేఖ ,సీతక్క, పొంగులేటి, ఎమ్మెల్యే లు, కాంగ్రెస్ నాయకులు ,వరంగల్ జిల్లాలో చొరవ తీస్కుంటున్నారని తెలిపారు.

# గురుకుల పోస్టుల భర్తీలో అభ్యర్థులకు అన్యాయం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలి

- హనుమకొండ కలెక్టరేట్‌లో పి.డి.ఎస్.యు. వినతి.




**తరంగాలు/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో గురుకుల పోస్టుల భర్తీలో అభ్యర్థులకు అన్యాయం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చొరవ చూపి నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహ రావు డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని కలెక్టరేట్ కార్యాలయం సూపరింటెండెంట్ పి. కృష్ణమూర్తికి పి.డి.ఎస్.యు. ఆధ్వర్యంలో ప్రతినిధి బృందంగా వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ గత పదేళ్లు నిరుద్యోగుల బతుకులతో చెలగాటం ఆడిన కేసీఆర్ సర్కారుకు రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా నిరుద్యోగులు తగిన బుద్ధి చెప్పి సాగనంపారు. ప్రజల ఆకాంక్షలు కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని విశ్వసించి అధికారం అప్పచెప్పారు. కానీ, గురుకుల బోర్డు అసంబద్ధ నిర్ణయాలతో వేలాదిమంది నిరుద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ గురుకులాల్లో ఉపాధ్యాయ నియామకాలలో గురుకుల బోర్డు అన్యాయమైన, వివాదాస్పద నిర్ణయాలతో అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.నోటిఫికేషన్ లో పేర్కొన్న విధంగా గురుకుల ఉపాధ్యాయ నియామకాలలో మొదటగా పై స్థాయి ఉద్యోగాల (డి యల్,జె యల్) తర్వాత కింది స్థాయి ఉద్యోగాలు (పీజీటీ,టీజీటీ) భర్తీ చేయాలి. కాని ప్రస్తుతం అన్ని పోస్టులను ఇష్టారీతిన ఒకేసారి నియామకాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్తితిలో ఒకే వ్యక్తి ఒకటి కన్నా ఎక్కువ ఉద్యోగాలలో ఎంపిక అవ్వడం జరుగుతుంది. కొందరు అభ్యర్థులైతే నాలుగు చొప్పున ఎంపిక అవుతున్నారు. మెజారిటీ పోస్టులకు ఇలాగే జరుగుతుంది. ఒక్కో అభ్యర్థి 2,3 పోస్టుల చొప్పున ఎంపిక కావడం వల్ల, మెరిట్ లో తర్వాత ఉన్న వారికి అవకాశం లేకుండా పోతుంది. ఎక్కువ ఉద్యోగాలు వచ్చిన వ్యక్తి ఒక ఉద్యోగాన్ని తీసుకుని, మిగతా వాటిని వదిలేసి వెళ్లడం, ఆ ఉద్యోగాలు అలాగే ఖాళీగా ఉండిపోవడం జరుగుతుంది. ఈ విధంగా దాదాపు 3000 నుండి 3500 ఉద్యోగాలు బ్యాక్ లాగ్ పోస్టులుగా మిగిలిపోయే పరిస్థితి ఉన్నది. ఇలా వేల సంఖ్యలో పోస్టులు మిగిలిపోవడం వల్ల, మెరిట్ ఉండి కూడా ఉద్యోగం పొందలేక నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతారు. కావున ఇట్టి విషయమై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక దృష్టి సారించి, పైస్థాయి నుంచి కిందిస్థాయికి పోస్టులను భర్తీ చేసేలా, రిలింక్విష్మెంట్ ఆప్షన్ లేదా 2%అ౧% లిస్ట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. గురుకుల నియామకాల్లో జనరల్ ర్యాంక్ లిస్ట్ (జి ఆర్ యల్) ప్రకటించకపోవడంతో అభ్యర్థులకు అనేక అనుమానాలు వస్తున్నాయి. ఈ అనుమానాలను నివారించడం కోసం తక్షణమే గురుకుల సహా ఇతర పోస్టులు అన్నిటికీ జనరల్ ర్యాంక్ లిస్టును ప్రకటించాలి. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టి ఎస్ పి ఎస్ సి) జూనియర్ లెక్చరర్ ఫలితాలను కూడా ముందుగా ప్రకటిస్తే మరింత మందికి న్యాయం జరుగుతుంది. కావున టిఎస్పిఎస్సి జెయల్, గురుకుల డియల్, జెయల్, పీజీటీ, టిజిటి మరియు పిడి,పిఈటి,లైబ్రేరియన్ పోస్టుల నియామకాలు వరుస క్రమంలో జరిపి వేలాది ప్రతిభ, అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేసి, వారి కుటుంబాల్లో సంతోషం నింపాలని కోరుతున్నాం. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. జిల్లా నాయకులు అశోక్, ప్రవీణ్, వినయ్, అరుణ్, రామరాజు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

- నిగూఢంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలి
- హెచ్ఎం సంకా బద్రి నారాయణ



**తరంగాలు/మహబూబాబాద్:** స్థానిక జడ్పీహెచ్ఎస్ మాదాపురం పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు సంకా బద్రి నారాయణ మాట్లాడుతూ,విద్యార్థిని విద్యార్థులు గమ్యం లేని గాలిపటంలా కాకుండా లక్ష్యం ఉన్న రాకెట్ల దూసుకుపోవాలని అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి లక్ష్యాలను సాధించాలని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు.ఈరోజు విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి చక్కని ప్రతిభ కనబరిచారని విద్యార్థులలో నిగూఢంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే ఇలాంటి కార్యక్రమాలు వారికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో 17 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందని డి ఈ ఓ గా పి జస్వంత్, హెచ్ఎం గా వై భార్గవి, పి ఈ టి గా ఎన్ యశ్వంత్, అటెండర్ గా ఎన్ కార్తీక్, అదేవిధంగా న్యాయ నిర్ణయితగా ఎస్ సంగీత, వ్యవహరించడం జరిగింది, అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం వి స్నేహలత, కె సుజాత, బి సౌభాగ్య, ఎన్ దుర్గయ్య, పి ప్రవీణ్, ఎల్ నాగరాణి, సి.హెచ్ రాజేందర్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


# ఏబీవీపి ఆద్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి




**తరంగాలు న్యూస్ తొర్రూర్:** హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఈరోజు తొర్రూరులో ఏబీవీపి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. స్థానిక దత్తు ఒకేషనల్ జూనియర్ కాలేజి లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏబీవీపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగధారి సిద్ధు మాట్లాడుతూ మొఘల్ రాజుల పాలనలో హిందువుల పరిస్థితి, ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెట్రేగి హిందువులు మతం మారడం తప్ప వేరే మార్గం లేక అల్లాడుతున్న దుస్థితి లో గెరిల్లా యుద్ధ తంత్రంతో మొగలాయిల గుండెల్లో గుబులు రేపి హిందూ సామ్రాజ్య స్థాపనకు కృషి చేసిన గొప్ప పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు.శివాజీ స్ఫూర్తి తో ప్రతీ ఒక్కరూ ధర్మం కోసం ధేశం కోసం క్రృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏబీవీపి నాయకులు రాజు, శివ,మనోజ్, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గృహజ్యోతి పథకానికి సహకరించండి

- విద్యుత్ శాఖ ఏఈ కావ్య



**పినపాక/తరంగాలు:** తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ద్వారా అందిస్తున్న గృహ జ్యోతి పథకానికి రాయితీ పొందేందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏ ఈ కావ్య కోరారు. సోమవారం పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ లో గల విద్యుత్ శాఖ కార్యాలయంలో మాట్లాడారు. విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారుల యిండ్లకు వచ్చినప్పుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, గృహ జ్యోతి దరఖాస్తు ఫారం, కరెంట్ బిల్లు, ఫోన్ నెంబర్, కరెంట్ బిల్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాలలో పూర్తి వివరాలు ఇవ్వని వినియోగదారులు ఉంటే స్థానికంగా ఉండే విద్యుత్ శాఖ అధికారులకు ఇవ్వవచ్చని తెలిపారు.ప్రజాపాలన దరఖాస్తు ఫారం, రేషన్ కార్డ్ లేకపోయినా ఆధార్ కార్డ్ ,ఫోన్ నెంబర్ అందజేసిన సరిపోతుందని తెలిపారు. ఇప్పటికి 93 శాతం ఆన్లైన్ ప్రక్రియ చేశామని తెలియజేశారు. మిగిలిన వారు కూడా స్వచ్ఛందంగా వివరాలు అందజేసి ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ఏమైనా అనుమానాలు ఉంటే విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి...

- హైకోర్టు ఉత్తర్వుల మేరకు జూనియర్ కళాశాల గెస్ట్ లెక్చరర్ లనకు ఉద్యోగ భద్రత (ఎం టి ఎస్) కల్పించాలి
- 10 ఏండ్లుగా పనిచేస్తున్న గత ప్రభుత్వం కనీస గుర్తింపు ఇవ్వలేదు
- డిస్టబ్ అయిన గెస్ట్ లెక్చరర్స్ ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి
- 3 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి
- 72 పీరియడ్స్ విధానాన్ని రద్దుచేసి 12 నెలల కన్సాలిడేే ఇవ్వాలి..
- గెస్ట్ లెక్చరర్స్ సంఘం మహబూబాద్ జిల్లా అధ్యక్షులు గడ్డం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ధర్మారపు సుధాకర్, కోశాధికారి గోవిందు సుధాకర్



**తరంగాలు/కేసముద్రం:** తెలంగాణ రాష్ట్రంలోని 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "త్రిమెన్ కమిటీ" ద్వారా ఎన్నికై గత 10 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న 1654 మంది గెస్టు లెక్చరర్లను హైకోర్టు జీవో నంబర్ 28131 /2023 ఉత్తర్వుల ప్రకారం ఎం టీ ఎస్ (మినిమమ్ టైం స్కేల్ ) ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు గెస్టు లెక్చరర్స్ సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గడ్డం రాజశేఖర్ తెలిపారు. సోమవారం గడ్డం రాజశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకులు సదానందం గౌడ్ నేర్చుత్వంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆఫీసులో, తెలంగాణ ఉద్యమ రథసారథి ఎమ్మెల్సీ కోదండరాం సార్ కు,కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కి హైకోర్టు ఆర్డర్ కాపిని అందజేయగా,మీ సమస్య న్యాయ బద్ధమైంది మీకు ఖచ్చితంగా న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు.మహబూబాబాద్ జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 21మంది పని చేస్తున్నామని, గత 10 సంవత్సరాల నుంచి ఇంటర్ విద్య వ్యవస్థలో సమర్థవంతంగా పనిచేస్తు ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి విద్యార్థుల సంఖ్య పెంచుతు ,రికార్డ్ స్థాయిలో ఇంటర్ రిజల్ట్స్ తెప్పించడములో గెస్టు లెక్చరర్స్ కృషి బలమైందని రాజశేఖర్ అన్నారు.గత ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్స్ పై వివక్ష పూరితంగా వ్యవహారించిందని, చాలీ చాలని జీతంతో సంవత్సరంలో 7,8 నెలలు మాత్రమే జీతం ఇస్తు అనేక ఇబ్బందులకు గురిచేసిందనీ,జీతాలు లేక జీవితాలు ముదుకు సాగక కుటుంబ భారంతో కొట్టుమిట్టాడుతూ అభద్రతా భావానికి గురై వనపర్తి, వెల్దండ,మెదక్, కొల్లాపూర్ లో 5 మంది గెస్ట్ లెక్చరర్స్ మరణించడానికి కారణమైనదని రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత నేటి ప్రజా ప్రభుత్వము సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చక్కగా పరిపాలిస్తు ప్రజలకిచ్చిన హామీలను నెరవేస్తుందని, ఎలక్షన్ లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారము అతిధి ఆధ్యాపకులను ఉద్యోగ భద్రత కల్పించి హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రకారం ఎం టీ ఎస్ గా మార్చాలని, మేధావులు, విద్యావేత్తలు విజ్ఞప్తి చేస్తున్నట్లు గడ్డం రాజశేఖర్ పేర్కొన్నారు.

# ప్రైవేట్ ఆంబులెన్స్ ల పరేషాన్..

- ఇష్టారాజ్యంగా ప్రైవేటు అంబులెన్సులు.
- ఆస్పత్రిలోనే మఖాం వేస్తున్న అంబులెన్స్ డ్రైవర్లు
- రిఫర్ అంటే అంతే సంగతులు
- అధిక చార్జీలు వసూలు చేస్తూ రోగులకు చుక్కలు
- ప్రైవేట్ ఆంబులెన్స్ లపై చర్యలు తీసుకొని అధికారులు







**పినపాక/తరంగాలు:** అంబులెన్స్ అంటే ఎంతో అవసరం ఉంటేనే కానీ ఉపయోగించని వాహనం... అంబులెన్స్ అంటే ప్రాణాపాయం వచ్చిందంటే దేవుడిలా ప్రత్యక్షమయ్యే వాహనం. అంబులెన్స్ అంటే ఎంతో మంది రోగులను సమయానికి ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రాణాన్ని నిలిపే ఓ సాధనం. ప్రభుత్వాలు కూడా అంబులెన్స్ లకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రోగులకు సరైన సమయంలో వైద్యం అందేలా చేయడంలో భాగంగా అనేక కార్యక్రమాలు, కార్యాచరణలు రూపొందిస్తున్నాయి. సమాజంలో ప్రతి ఒక్కరికి అంబులెన్స్ అంటే ఒక గౌరవం ఉన్నది. అనేకమంది ప్రజలు అంబులెన్స్ వెళ్తుంటే దానిలో వెళ్లే రోజులు క్షేమంగా బ్రతకాలని చేతులెత్తి మనసులో ప్రార్థన చేసుకుంటారు. అంతటి విశిష్టమైన సేవలు అందించే అంబులెన్స్ లు నేడు కొంత ప్రజల వ్యతిరేకతను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

నాలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా, ఆ రాష్ట్రాల ప్రజల ఆరోగ్యానికి భరోసాగా, పెద్దదిక్కుగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిలుస్తుంది. అనేక సమస్యలతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కొట్టుమిట్టాడుతున్నా అందులో అద్భుతమైన సేవలు అందిస్తున్న కొంతమంది డాక్టర్ల పుణ్యం కారణంగా వేలాదిమంది పేద రోగులు అనునిత్యం ఇక్కడికి వచ్చి వైద్య సేవలు పొంది వెళ్తుంటారు. పలు రాష్ట్రాలకు సరిహద్దులో పెద్ద ఆసుపత్రి కావడం వలన అనేక రకాల రోగులు, యాక్సిడెంట్ ల బారిన పడినవారు, అత్యవసర చికిత్స నిమిత్తం వచ్చేవారు ఉంటున్నారు. ఈ రోగులకు ప్రభుత్వ వైద్యులు తమకు సాధ్యమైనంతవరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్యం అందించే ప్రయత్నం చేస్తున్నారు. కొంతమందిని అత్యవసర పరిస్థితులలో ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయడం జరుగుతుంది. ఇలా పేషెంట్ రిఫర్ చేస్తారు అని తెలిసిందో లేదో కొంతమంది ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్లు ఆసుపత్రిలో రోగుల వద్దకు వచ్చి మా అంబులెన్స్ ఉంది మేము తీసుకెళ్తాము అని రోగులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రాత్రనకా, పగలనకా ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు హాస్పిటల్ ఎమర్జెన్సీ బ్లాక్ లో కూర్చొని అటు ఆసుపత్రి సిబ్బందిని, ఇటు రోగులను వెంటాడి వేధించి తమ అంబులెన్స్ లలో ఇతర ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఆసుపత్రిలో రోగులు కదా అనే మానవత్వం కూడా లేకుండా అధిక చార్జీలు వసూలు చేస్తూ రోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రైవేట్ అంబులెన్స్ లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వంద మీటర్ల దూరంలో ఉండాలనే నిబంధన ఉన్న ఆస్పత్రి లోనే డ్రైవర్లు ఉంటూ ఆసుపత్రి ప్రక్కనే అంబులెన్స్ లు నిలిపి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రాత్రి సమయంలో పలువురు డ్రైవర్లు తాగి ఆసుపత్రిలో రోగులను, సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారని గతంలో అనేక ఫిర్యాదులు ఆసుపత్రి అధికారులకు వచ్చిన పెద్దగా పట్టించుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసి ప్రైవేట్ ఆంబులెన్స్ లు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ప్రాంతంలో ఉండరాదని, డ్రైవర్లు, ఓనర్లు రోగులను ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు మాట్లాడడం కోసం ఆసుపత్రిలోకి రావద్దని హెచ్చరించిడం జరిగింది. పోలీసులు ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లను, ఓనర్లను పిలిచి హెచ్చరించిన కొద్ది రోజులు పాటించిన ప్రైవేటు అంబులెన్స్ లు మరలా రెచ్చిపోయి తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. కొన్ని ప్రైవేట్ ఆంబులెన్స్ లకు సరైన వాహన ధ్రువీకరణల పత్రాలు లేవని, డ్రైవర్లకు లైసెన్సులు కూడా లేవనే ఫిర్యాదుతో మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ కూడా విచారణ చేసి అందరికీ లైసెన్సులు, వాహన పత్రాలు ఉండకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించడం కూడా జరిగింది. అధికారులు ఎంతో కొంత శ్రద్ధ తీసుకుంటున్న కొన్ని ప్రైవేట్ అంబులెన్స్ ల విచ్చలవిడితనం వలన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఏది ఏమైనా ఇలా ప్రవర్తించే డ్రైవర్లు, ఓనర్లపై ఆసుపత్రి అధికారులు, పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి...

- వైష్ణవి హై స్కూల్ పేరు మీద పర్మిషన్
- శ్రీ చైతన్య పేరుతో అధిక ఫీజులు వసూలు
- దోపిడీకి గురవుతున్న విద్యార్థుల తలిదండ్రులు
- ఎన్ ఎస్ యు ఐ మీకు తోడుగా ఉంటది
- ఎన్ ఎస్ యు ఐ జనగామ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభి గౌడ్



**తరంగాలు ప్రతినిధి/జనగామ:** అడ్డదారిలో దోచుకుంటున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని జనగామ ప్రజావాణిలో కలెక్టర్‌కి ఎన్‌ఎస్ యు ఐ జనగామ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభి గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 2 సంవత్సరాల నుండి వైష్ణవి హై స్కూల్ పేరు మీద పెర్మిషన్ తీసుకొని శ్రీ చైతన్య పేరుతో విద్యార్థులని దోచుకుంటున్నారని తెలుసుకొని ఆ పాఠశాలను మూసి వేయడం జరిగిందన్నారు. కానీ మళ్ళీ అదే అధికారులు దొంగ దారిలో ఆ పాఠశాల యాజమాన్యాలకు పెర్మిషన్ ఇచ్చారు. దీంతో వారికి హద్దు అదుపు లేకుండా పోయిందన్నారు. విచ్చల విడిగా విద్యార్థులను మోసం చేస్తు... అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు ఎక్కడ లేని విధంగా ఒక కొత్త విధానాన్ని తీసుకొచ్చి ఐఐటి, సీబీఎస్ఈ టాలెంట్ టెస్ట్ అని వివిధ రకాలుగా విద్యార్థులను ఫీజుల రూపంలో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, అదేవిధంగా వాటికి హాల్ టికెట్స్ అని వంక పెట్టుకొని మొత్తం ఫీజు కడితేనే ఇస్తామని బెదిరిస్తూ విద్యార్థులను మానసికంగా హింసిస్తూ వారిని టార్చెర్ చేస్తున్నారని అన్నారు. దోపిడీకి గురవుతున్న విద్యార్థుల తలిదండ్రులు కూడా ఎం చేయలేని దయనీయ స్థితిలో ఉన్నారని, మేము మా ప్రభుత్వ పరంగా ప్రతీ విద్యార్థికి మరియు వారి తెలిదండ్రులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మీకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది ఉన్న మీకోసం ఎన్ఎస్యుఐ మీకు తోడుగా ఉంటుందని తెలిపారు. కార్పొరేట్ విద్యా వ్యవస్థల దోపిడీని అరికట్టేందుకు సర్వ విధాల కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జనగామ టౌన్ అధ్యక్షులు కార్తీక్, ధీరజ్, వేణు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్‌కు అపూర్వ స్పందన

- జిల్లా వ్యాప్తంగా 3500 మంది హాజరు
- బి.వీరభద్రం,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి








**పినపాక/తరంగాలు:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19,20 తేదీల్లో నిర్వహిస్తున్న మండల స్థాయి టాలెంట్ టెస్ట్ మొదటి రోజు పినపాక, ఇల్లందు, అశ్వారావుపేట మండల కేంద్రాల్లో నిర్వహించగా 3500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష గత 25 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో నిష్ణాతులైన వారిచే ప్రశ్నాపత్రం రూపొందించినట్లు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం టాలెంట్ టెస్ట్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులతో మాట్లాడుతూ... 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న వేళ ఎస్ఎఫ్ఐ నిర్వహించే టాలెంట్ టెస్ట్ విద్యార్థుల మెదళ్ళ మానసిక అభివృద్ధికి ఉత్ప్రేరకంగా ఉంటుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు చదువుల్లో రాణించాలని, 10వ తరగతి ఉజ్వల భవిష్యత్తుకు తొలిమెట్టు అన్నారు. మండల స్థాయిలో రాణించిన మొదటి 5 మందికి జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ ఈ నెల 24న నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన మొదటి ముగ్గురికి రూ.5000, 3000,1500 మరియు షీల్డ్స్ అందించనున్నట్లు తెలిపారు. టాలెంట్ టెస్ట్ కు జిల్లా ఉపాధ్యక్షులు సందీప్, నాగకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిష్కరించాలి

**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** ప్రజాపాలన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వెనువెంటనే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ తెలిపారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాఖల వారీగా అందిన దరఖాస్తులపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏ శాఖలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్ ఉన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. హైద్రాబాద్



ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాకు చెందిన అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులపై సత్వర చర్యలు చేపట్టి తీసుకున్న చర్యలు తెలియజేయాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో ప్రతేక శ్రద్ధ కనబర్చాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం ఆర్డిఓ గణేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని 17 లోక్ సభ స్థానాలను కైవసం చేసుకుంటాం

**పినపాక /తరంగాలు:** కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రత్యేక దృష్టి సారించిందని పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ మండల అధ్యక్షులు తెలియజేశారు. సోమవారం పినపాక మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం అధ్యక్షతన నియోజకవర్గం ఏడు మండలాల అధ్యక్షులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండగా తెలంగాణలోని 17 లోక్ సభ స్థానాలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ పార్లమెంటు స్థానం పార్టీ ఎవరికి కేటాయించిన కచ్చితంగా అత్యధిక మెజార్టీతో గెలిపించి తీరుతామని తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు శ్రేణులు సమయతం చేసే దిశలో పార్టీ కార్యకలాపాలు మొదలుపెట్టామన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే బూత్ కమిటీలు పూర్తి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో పినపాక



మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం, మణుగూరు మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, కరగూడెం మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, అశ్వాపురం మండలం అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, బూర్గంపాడు మండల అధ్యక్షుడు దుర్గంపూడి కృష్ణారెడ్డి, ఆళ్లపల్లి మండల అధ్యక్షులు పాయం రామ నరసయ్య, గుండాల మండల అధ్యక్షుడు ముత్యం చారి మైనార్టీ సెల్ జిల్లా నాయకులు మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన "వీరుడు ఛత్రపతి శివాజీ"





- ధీరత్వానికి మరో పేరు శివాజీ...
- యుద్ధంలో గెలుపు తప్ప ఓటమి ఎరగని యోధుడు...
- అలాంటి యోధుడి చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి...
- పిఎసిఎస్ చైర్మన్ కోడగాని రాజేష్ ఖన్నా,మార్కెట్ చైర్మన్ కమ్మగోని స్వామి రాయుడు...

**తరంగాలు/వర్ధన్నపేట:** మరాఠా వీరుడిగా పేరుగాంచిన భరతమాత ముద్దుబిడ్డ, స్త్రీని గౌరవించి, హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు ఛత్రపతి శివాజీ అని, అలాంటి యోధుడి చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిఏసిఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా, మార్కెట్ చైర్మన్ కమ్మగోని స్వామి రాయుడు అన్నారు. సోమవారం వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో పిఏసిఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ...హిందూ సామ్రాజ్యం రక్షణలో చత్రపతి శివాజీ మహారాజ్ కీలక పాత్ర పోషించారని, ధైర్యానికి, ధీరత్వానికి మరో పేరు శివాజీ అని కొనియాడారు. మొగలులకు ముచ్చెమటలు పట్టించి, యుద్ధ విద్యలో ఆరు తెరిన ధీరుడు అన్యమతస్తులను గౌరవిస్తూ హిందూ మత ధర్మ పరిరక్షణకు పాటుబడి అందరితో చత్రపతిగా పిలువబడుతున్న ఘనత ఆ మరాఠ యోధుడికే దక్కుతుందన్నారు. యుద్ధంలో గెలుపు తప్ప ఓటమి ఎరగని యోధుడు అని, ఆయన పేరు వింటేనే భారతావని పులకించి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారిపై హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా కమిషనర్ విచారణకు ఆదేశించడంతో విచారించిన డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్



**తరంగాలు న్యూస్ మహబూబాబాద్** :మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మీడియా అక్రిటిడేషన్ కార్డుల మంజూరు విషయంలో అవకతవకలు జరిగాయని ఈనెల తేది 02/02/2024 రోజున బాల్నే సుమన్ తండ్రి మృత్యుంజయ మహబూబాబాద్ సీనియర్ జర్నలిస్ట్ సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కి మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిపై ఫిర్యాదు అందజేయడంతో వెంటనే డిప్యూటీ డైరెక్టర్ తో విచారణకు ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ ఈరోజు మహబూబాబాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో విచారణ చేసి ప్రస్తుతం పని చేస్తున్న డి పి ఆర్ ఓ గా ఉన్న కలువల శ్రీనివాస్ పై చేసిన ఫిర్యాదులన్నీ వాస్తవమేనని సంబంధిత ఆధారాలన్నీ సేకరించి సస్పెండ్ చేస్తానని తెలిపారు.

# ఖమ్మంలో ఆటోమోటివ్ కార్ ఆక్ససిరీస్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం.** ఖమ్మంలో ఆటోమోటివ్ కార్ ఆక్ససిరీస్ ఖమ్మం నూతన షోరూమ్ ను రాష్ట్ర రెవెన్యూ శాఖ, గృహ నిర్మాణ %డ% సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్ స్పేర్ పార్ట్స్ ఆండ్ ఆక్స సిరీస్ రంగంలో మెట్రోపాలిటన్ నగరాలకు ఏమాత్రం తీసిపోకుండా ఖమ్మం నగరం వర్తక , వాణిజ్య వ్యాపార రంగాలలో మరింత విస్తరించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.. ఖమ్మం యువకులు ఈ రంగంలో తమ ప్రావిణ్యతను మరియు అనుభవాన్ని జతకలిపి వినియోగదారులకు నాణ్యమైన సేవలను మన్నికైన వస్తువులను అందించి వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే తమ వ్యాపారాలు లాభసాటిగా ఆప్యాయతతో కొనసాగుతాయని మంత్రి పొ%శీ%గులేటి అన్నారు. సంస్థ యజమానులు జావీద్, ఇమ్రాన్ ఇద్దరు కలిసి సంస్థను ఏర్పాటు చేసుకుని ఆటోమోటివ్ కార్ ఆక్సిసిరీస్ నూతన షోరూమ్ సేవలను మరిన్ని బ్రా%శీ%చులుగా విస్తరించే విధంగా కృషి చేయాలని మంత్రి పొంగులేటి ఆకాంక్షించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి జావీద్,ఇమ్రాన్ లు శాలువాతో ఘన%శీ%గా సత్కరించారు.

# పెట్టుబడులు పెడితే ఎక్కువ నగదు ఇస్తామని నమ్మబలికే వారితో అప్రమత్తంగా ఉండాలి

**పోలీసు కమిషనర్ సునీల్ దత్**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం కమిషనర్ కార్యాలయం:** పెట్టుబడులు పెడితే రెట్టింపు నగదు చెల్లస్తామని నమ్మబలికే స్కీమ్ ల పట్ల అప్రమత్తంగా వుండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవేన్స్ డే కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదులలో ఇన్వెస్ట్మెంట్ స్కీం పేరుతో లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టిన దివ్యాంగులను మోసం చేశారని నగరానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రీవేన్స్ డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 25 మంది బాధితుల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులో అధికంగా భూ వివాదాలు, కుటుంబ , వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు , భార్యభర్తల సమస్యలపై వచ్చిన బాధితుల ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకొవాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశించారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్ ఖమ్మం




**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం:** ఆటోలో మరిచిపోయిన మెడికో విద్యార్థిని సెల్ ఫోన్‌ను కమాండ్ కంట్రోల్ సిఐ అంజలి వెతికి పట్టుకొని బాధితులకు అప్పగించారు. సోమవారం మమత కాలేజ్ కు ఆటోలో వెళ్తున్న విద్యార్థిని సాయిప్రియ (మమతా హాస్పిటల్ మెడికో హౌస్ సర్జన్) మమత హాస్పిటల్ వద్ద ఆటో దిగి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఫోన్ ఆటో మరచిపోయినట్లు గుర్తించి ఖమ్మం ఖానాపురం హావేలి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితులు చేసిన ఖానాపురం హావేలి పోలీసుల సూచనలతో కమాండ్ కంట్రోల్ నుండి సీసీ కెమెరాలలో వారు ప్రయణించిన ఆటోను గుర్తించి ఆటో డ్రైవర్ గోపి నాయక్ సంప్రదించారు. అతడు ఆటోను తనిఖీ చేయగా, సీటుపై సైలెంట్ మోడ్ లో వున్న ఫోన్ కనిపించడంతో కమాండ్ కంట్రోల్ సిఐ అంజలి కి అందజేశాడు. బాధితులని పిలిచి ఆటో డ్రైవర్ చేతుల మీదుగా మొబైల్ ఫోన్ బాధితులకు అప్పగించారు. కార్యక్రమంలో సీసీ టివి టెక్నిషన్ ప్రకాష్ గాంధీ పాల్గొన్నారు.